23 నుంచి జువెల్లరీ వరల్డ్ ఎగ్జిబిషన్

ఎగ్జిబిషన్ సన్నాహక కార్యక్రమంలో.. మోడల్స్

వెంగళరావునగర్, ఆగస్టు 18: ప్రపంచంలోని ప్రసిద్ధ బ్రాండ్లతో ఆధునిక, సాంప్రదాయ డిజైన్లతో జువెల్లరీ వరల్డ్ ఎగ్జిబిషన్ హోటల్ తాజ్ కృష్ణలో ఏర్పాటు కానుంది. ఆదివారం ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్‌లో జరిగింది. ఈ నెల 23వ తేది నుంచి 25 వరకు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వివాహ, పండుగలకు కావాల్సిన ఆభరణాలు ఎగ్జిబిషన్‌లో ఉంటాయని ఇక్కడే షాపింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కాచిగూడ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను ప్రారంభించాలి

సమావేశంలో అభివాదంచేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఖైరతాబాద్, ఆగస్టు 18 : కాచిగూడ సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను పునః ప్రారంభించాలని బాలుర హాస్టల్ పూర్వ విద్యార్థుల కమిటీ డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సలహాదారులు, బీఆర్ఎస్వీ వ్యవస్తాపక సభ్యులు బొమ్మర రామమూర్తి, కమిటీ అధ్యక్షుడు బోయిని శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడుతూ.. 1972లో అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు హయాంలో నింబోలిఅడ్డలో బాలుర హాస్టల్‌ను ప్రారంభించారని, నాటి నుంచి ప్రతి ఏడాది 500 నుంచి 600 మంది విద్యార్థులు ఇందులో ఉండి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఇదే హాస్టల్‌లో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజ నర్సింహ, ఎంపీ ఈటల రాజేందర్ లాంటి వారు ఉండి చదువుకున్నారన్నారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ హాస్టల్ మూతపడటంతో శిథిలావస్థకు చేరుకుంటుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోవడం లేదని, బీసీ, ఎస్సీ హాస్టళ్లకు మెస్ చార్జీలు నిధులు ఇవ్వడం లేదని తెలిపారు. హాస్టల్‌ను తెరిపించాలని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేదని చెప్పారు. ఈ నెల 31లోగా హాస్టల్‌ను తెరిపించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పూర్వ విద్యార్థుల కమిటీ సలహాదారు డి.సంగమేశ్వర్, ప్రదాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బి.గోవింద్, సహాయ కార్యదర్శులు రమేశ్, ప్రవీణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు కె. రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

బోరబండ మెయిన్‌రోడ్డుపై మ్యాన్‌హోల్ నుంచి పొంగిపొర్లుతున్న మురుగు నీరు

బోరబండలో మురుగు పరుగు

- అవస్థలు పడుతున్న స్థానికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ఎర్రగడ్డ, ఆగస్టు 18: బోరబండ బస్టాండ్ మీపంలోని మెయిన్ రోడ్డు మురికి కూపంగా మారింది. వారంలో ఐదు రోజులు మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు పొంగిపొర్లడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్‌లోని పీజేఆర్ విగ్రహానికి చేరువలో ఉన్న మూడు మ్యాన్‌హోళ్ల నుంచి పెద్ద మొత్తంలో మురుగు నీరు పొంగి పొర్లి రోడ్డు పైకి చేరుతున్నదని అన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు మెయిన్‌రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తూనే ఉన్నది. నెలలో 20రోజులు ఇదే పరిస్థితి తలెత్తుతున్నదని.. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని తెలిపారు.

వర్షాలు కురువాలని కప్పతల్లి ఆట

వర్షాలు కురువాలని శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో యువరైతు శ్రీరాములు ఆధ్వర్యంలో మహిళలు కప్పతల్లి ఆట ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షకాలం పూర్తి కావస్తున్నా వానలు కురియకపోవడంతో శంషాబాద్ మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పూర్వకాలం నుంచి కప్పతల్లి ఆట ఆడితే వర్షాలు కురుస్తాన్న నమ్మకంతో ఆడిన్నట్లు తెలిపారు. వర్షాలు కురిస్తే భూగర్భజలాలు నిండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగుచేస్తారని వివరించారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు నీలమ్మ, భారతమ్మ, జంగమ్మ, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు. – శంషాబాద్ రూరల్, ఆగస్టు 18

గోల్కొండను ఏలిన సర్దార్ పాపన్నగౌడ్

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



చిన్నగోల్కొండ గ్రామంలో సర్వాయ్‌పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్, ఆస్టు 18 : గోల్కొండ కోటను ఏలిన బహుజన బిడ్డ సర్దార్‌సర్వాయ్ పాపన్నగౌడని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. ఆదివారం శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ గ్రామంలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అయిన సర్వాయ్ పాపన్న గౌడ్ తెలంగాణలోని వెనుకబడిన వర్గాల కోసం కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పద్మావతి, అనంతరెడ్డి దంపతులు, గౌడ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన పద్మశాలి సంఘం ఎన్నికలు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 18: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ప్రశాంతంగా ముగిశాయి. డివిజన్ పరిధిలోని భవన బుషి కాలనీ శ్రీ మార్కండేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి పద్మశాలి సంఘం సభ్యులు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 431 ఓట్లు ఉండగా అందులో 384 మంది తమ ఓటు హక్కును వినియోగించారు. మొత్తం 89 శాతం ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారి రమాదేవి తెలిపారు. పోలింగ్ బాక్సును ఆమె సమక్షంలో భద్రపరిచారు. మంగళవారం ఈ ఓట్లను లెక్కించి గెలుపొందిన వారిని ప్రకటిస్తామని తెలిపారు.

ఎన్నికల బాక్స్‌ను ఎన్నికల ఆఫీసర్ రమాదేవికి అప్పగిస్తున్న సంఘం సభ్యులు

విద్యుత్ సీఎండీకి అభినందనలు..

అభినందనలు తెలుపుతున్న తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

వెంగళరావునగర్, ఆగస్టు 18:విద్యుత్ శాఖకు చెందిన సుమారు 3 వేల మందికి విద్యుత్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పదోన్నతులు కల్పించారు. దీంతో తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 నాయకులు సీఎండీని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 తరుపున ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని సీఎండీని కోరినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్, కె.శ్రీనివాస్ తెలిపారు. పదోన్నతులు సాధించినందుకు సంతోషంగా ఉందని, సహకరించిన సీఎండీతో పాటు యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వజీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ నాయకులు లింగం, సురేశ్, సాయి, సోని, రాజు వసంత పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 21న భారత్‌బంద్

సమావేశంలో నినాదాలు చేస్తున్న సమితి ప్రతినిధులు

ఖైరతాబాద్, ఆగస్టు 18 : ఎస్సీ, ఎస్టీ విభజనను వ్యతిరేకిస్తూ ఈ నెల 21న భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ డి. సర్వయ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కో కన్వీనర్లు జి. చెన్నయ్య, చెరుకు రాంచందర్‌తో కలిసి మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు భారతదేశంలోని యావత్ దళితులు, బహుజనులు, ఆదివాసీ వర్గాల మనోభావాలపై ప్రభావం పడిందన్నారు. మాలలకు మొదటి నుంచి అన్యాయం జరుగుతూనే ఉందని, ఎస్సీ కార్పొరేషన్ పదవులు, ప్రభుత్వ పథకాలు మాదిగలకే దక్కుతున్నాయని, గురుకుల పాఠశాలల్లో మాలలకు ప్రాధాన్యత లేదన్నారు. 21న నిర్వహించే ధర్నాలో తెలంగాణలోని 33 జిల్లాల నుంచి అన్ని సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని అన్నారు. న్యాయమైన ఉద్యమాలు చేసి ఎస్సీ వర్గీకరణను అడ్డుకొని తీరుతామన్నారు. త్వరలోనే వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో రిట్‌పిటీషన్ దాఖలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కోకన్వీనర్లు బల్వంత్, తాళ్లపల్లి రవి, జంగా శ్రీనివాస్, బాలకిషన్, సుధీర్, లింగస్వామి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హైదర్‌గూడలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ల బృందం

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 18: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని గాంధీ విగ్రహం వద్ద పారా మెటర్నిటీ అండ్ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ రమేశ్‌తో కలిసి నారగూడెం మల్లారెడ్డి హాజరై ప్రారంభించారు. డాక్టర్ల బృందం బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర పరీక్షలను నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరం అశోక్, సాబాద విజయ్‌కుమార్, డాక్టర్ల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగేండ్ల క్రితం విగ్రహం ఆవిష్కరణ..

- నేడు సీఎం ఆవిష్కరించినట్లు శిలాఫలకం
- సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఘటన

ఎర్రగడ్డ, ఆగస్టు 18: బోరబండ డివిజన్ సైట్–2 కాలనీ కమ్యూనిటీహాల్ వద్ద నాలుగేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయగా నాటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, అప్పటి డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌లు కలిసి ఆవిష్కరించారు. ఐతే ఆదివారం సర్వాయి పాపన్న జయంతిని బోరబండ గౌడ సంఘం నాయకులు నిర్వహించారు. నాలుగేండ్ల క్రితం జరిగిన విగ్రహం దగ్గర ఆదివారం మరో శిలాఫలకాన్ని గౌడ సంఘం వారు ఏర్పాటు చేసి ఈ రోజు(18 ఆగస్టు 2024) సీఎం రేవంత్‌రెడి పాపన్న విగ్రహావిష్కరించినట్లు అందులో ఉన్నది. ఒకే విగ్రహాన్ని రెండు పర్యాయాలు ఆవిష్కరించటం ఏమిటని అడగ్గా నీళ్లు నమలటం గౌడ సంఘం నేతల పనైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను తాము చేసినట్లు ప్రచారం చేసికోవడానికే ఇలా చేశారని పలువురు విమర్శిస్తున్నారు.

సర్వాయి పాపన్న విగ్రహం వద్ద గౌడ సంఘం ఆదివారం ఏర్పాటు చేసిన శిలాఫలకం

యాచకుడు మృతి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 18 : స్థానికంగా భిక్షాటన చేసే వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మైలాదేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి దుర్గానగర్ చౌరస్తా ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే ఘటనన స్థలానికి చేరుకొని పరిశీలించగా ఆ వ్యక్తి అప్పటికే మృతి చెంది ఉన్నాడన్నారు. వ్యక్తి వివరాలు తెలుసుకోగా స్థానిక ప్రాంతాల్లో భిక్షాటన చేస్తుంటాడని సమాచారం అందిందన్నారు. అనారోగ్యం కారణంగా మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చరీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖైరతాబాద్ రేస్ కోర్సులో బెట్టింగ్.. నిర్వాహకుల అరెస్టు

ఖైరతాబాద్, ఆగస్టు 18 : ఖైరతాబాద్‌లోని (హైదరాబాద్ రేస్ క్లబ్ ఆఫ్ కోర్సు టోట్ సెంటర్) రేస్ కోర్సులో బెట్టింగ్ రాయుళ్లు దందా ప్రారంభించారు. ఓ వైపు రేసు క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతుండగా, మరో వైపు బెట్టింగ్ రాయుళ్లు సందెట్లో సడేమియా అన్న చందంగా తమ వ్యాపారం సాగిస్తున్నారు. వారిపై కన్నెసిన పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఖైరతాబాద్ ఎస్సై ఎ. సందీప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ రేస్ కోర్సులో కాచిగూడకు చెందిన మహశ్ (69), మల్లేపల్లికి చెందిన అసద్ అహ్మద్ (41)లు అక్రమ బెట్టింగ్‌ల దుకాణం తెరిచారు. వీరి నిర్వహణలో బాలానగర్‌కు చెందిన సాయిలు (36), బోరబండాకు చెందిన షేక్ అక్బర్ (48) పంటర్లుగా వ్యవహరిస్తున్నారు. రేస్ కోర్సు నిర్వాహకులతో కలిసి పోటీలో పాల్గొంటే వారికి 30 శాతం కమిషన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఎంట్రీ ఫీజు చెల్లించి లోనికి ప్రవేశించిన వీరు నిర్వాహకులతో సంబంధం లేకుండా అక్కడకు వచ్చే వారికి మాయమాటలు చెప్పి బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ నలుగురినీ అదుపులోకి తీసుకొని గేమింట్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడే రాఖీ..

- జోరుగా రాఖీల విక్రయం
- ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రాల వద్ద హిళల సందడి

బండ్లగూడ, ఆగస్ట్ 18 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రాఖీ పండుగ సందడి మొదలైంది. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా రాజేంద్రనగర్‌లో ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేసి రాఖీ విక్రయాలను జోరుగా చేపట్టారు. నగరంలోని దూల్‌పేట రహీంపూర ప్రాంతాలల్లో తయారు అయ్యే రాఖీలను చిరు వ్యాపారులు కొనుగోలు చేసుకుని వచ్చి ఇక్కడ విక్రయాలను చేస్తున్నారు. సోమవారం రాఖీ పండగ కావడంతో అత్తాపూర్, హైదర్‌గూడ, బండ్లగూడ, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాలల్లో రహదారుల వెంట దుకాణాలను ఏర్పాటు చేసి రాఖీల విక్రయాలను చేపడుతున్నారు.

ఫ్యాన్సీ రాఖీలకు ఆదరణ..

ఫ్యాన్సీ రాఖీల పట్ల మహిళలు ఎక్కువ శ్రద్ధ చూపుతుండటంతో వ్యాపారులు తమ దుకాణాలలో ఫ్యాన్సీ రాఖీలను అందుబాటులో ఉంచి పెద్ద ఎత్తున విక్రయాలను చేపడుతున్నారు. కలకత్తా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రల నుంచి ఈ ఫ్యాన్సీ రాఖీలను వ్యాపారులు దిగుమతి చేసుకుని విక్రయాలను చేపడుతున్నారు.

మిఠాయిలకు పెరిగిన గిరాకీ..

రాఖీ పండగ సందర్భంగా మిఠాయిల దుకాణాలలో స్వీట్లు కొనుగోలు చేసేందుకు శ్రద్ధ చూపారు.

హైదర్‌గూడలో ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఆకృత్యాన్ని ఖండిస్తూ ఆదివారం సాయంత్రం ఖైరతాబాద్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి సేవా కేంద్రం నుంచి బడా గణేశ్ వరకు కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద స్త్రీ ముక్తి లీగ్ నౌజవాన్ భారత్ సభ, దిశా స్టూడెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తాధ్వర్యంలో వివిధ వైద్య కళాశాలలకు చెందిన విద్యార్థులు కొవ్వత్తుల ప్రదర్శన నిర్వహించారు. – ఖైరతాబాద్

దోపిడీలేని సమాజానికి పోరాడాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 18: దోపిడీ లేని సమాజానికి ప్రతి ఒక్కరూ పోరాడాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. సమాజ ఉన్నతికి మరింత బాధ్యతతో కొనసాగాలని సూచించారు. ఇటీవలి జూనియర్ లెక్చరర్, గురుకుల డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలు సాధించిన ఎకానమిక్స్ విద్యార్థులతో కలిసి ఎంవీఎన్ ఎకానమిక్స్ సక్సెస్ మీట్ – 2024ను ఆదివారం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ రాములు అధ్యక్షత వహించగా, నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్గొండ ఎకానమిక్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ మీనయ్య అందించే ఉచిత శిక్షణ ద్వారా ఉద్యోగాలు సాధించిన అరవై మందికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి మనిషి వ్యక్తిగత వృద్ధి లేకపోవుటకు కారణం దోపిడీని, దోపిడీ లేని వ్యవస్థ నిర్మాణానికి వారి బోధన ఉపయోగపడాలని కోరారు. దేశాభివృద్ధి కొంత మంది వ్యక్తులకు, కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాల ప్రజానీక సమస్యల పరిష్కారం కోసం తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ సమాజంలో రాజకీయాలు, విద్యాబోధన వ్యాపారమవుతున్న ఈ కాలంలో మానవీయ విలువలు కలిగిన మీనయ్య వంటి వాళ్లు ఎంతో ఆదర్శంగా ఉండడం గర్వకారణమన్నారు. నడుస్తున్న కాలంలో స్పందించే గుణం కరువైతున్న తరుణంలో ఇలాంటి సమావేశాలు జరగడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ నంద్యాల నర్సిరెడ్డి, కామ్రేడ్ జూలకంటి రంగారెడ్డి, డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్లు డైసీ, ఉపేందర్, ఇంద్రకాంత్, శివారెడ్డి, గణేశ్, కొండల్, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ దుబ్బ రంజిత్, నరేందర్, ప్రవళిక, సుల్తానా, రాఘవేంద్ర, కిరణ్, సైదులు, దీపిక, ఎల్లస్వామి, అరవింద్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

దేశ వ్యాప్తంగా దళిత జనాభా లెక్కలు నిర్వహించాలి

హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

హిమాయత్‌నగర్,ఆగస్టు18: సామాజికంగా,ఆర్థికంగా వెనుకబడి ఉన్న దళితుల జన గణన నిర్వహించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిమారుపాక అనిల్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో డీహెచ్‌పీఎస్ నగర కౌన్సిల్ సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ సబ్‌ప్లాన్ చట్టాన్ని అమలు చేసి, జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ నగర అధ్యక్షుడు ఆరుట్ల రాజ్‌కుమార్,ప్రధాన కార్యదర్శి జే.కుమార్, నాయకులు సురేందర్,బాబు,రఘు,లక్ష్మి పాల్గొన్నారు.